**కథ**

డిసెంబర్ నెల. ఎముకలు కొరికేటట్టుంది చలి. ఉదయం ఎంత త్వరగా లేవాలని ప్రయత్నించినా మంచం దిగేసరికే ఏడుదాటుతోంది.

# జీవన జ్యోతి

తలకి పూర్తిగా ఊలు టోపీ పెట్టుకుని పెరట్లో కాస్త ఎండ తగిలే ప్రదేశంలో కుర్చీ వాల్చుకుని ఆ రోజు పేపర్ చూస్తూ కూర్చున్నాను. అప్పటికే జానకి తలస్నానం చేసి, తడి జుట్టుకి టవల్ చుట్టుకుని, కుళాయి దగ్గర దేవుడి విగ్రహాలు తోముతూ కూర్చుంది. నేను పేపరూ, కుర్చీ తెచ్చుకుని కూర్చోవడం చూసి "ఒక్క అర గంట ఆగుతారా కాఫీకి?" అంది నేను కాఫీ తీసుకురమ్మని అడక్కుండానే.

"అలాగేలే. అరగంటకాదు, గంట ఆగుతాను" అన్నాను ఆమెని నిశితంగా గమనిస్తూ. తన పనిలో తను పూర్తిగా నిమగ్నమై ఉంది. చింతపండుతో తోమిన విగ్రహాల్ని శుభ్రంగా కడిగి, వాటిలో మెరుపు పూర్తిగా వచ్చిందో లేదోనని ప్రతీ విగ్రహాన్నీ ఎండలో జాగ్రత్తగా పరిశీలిస్తోంది. ఏ పనిచేసినా నాణ్యత రావాలని ఆరాటపడే మనస్తత్వం ఆమెది.

ఇంట్లో ఉండేది ఇద్దరమే అయినా ఉదయం ఆరుగంటలకి లేచిన దగ్గరనుండీ రాత్రి పదయ్యే వరకూ ఏదో పనిలో నిమగ్నమయ్యే ఉంటుంది.

ఆఫీసు పనుల ఒత్తిళ్ల వలన నేను సర్వీసులో ఉండగా ఆమెనంతగా గమనించడానికి అవకాశం లేకపోయింది. క్రిందటి నెలలో రిటైర్ అయిన తర్వాత ఇంటిపట్టునే ఉంటున్నాను. కనుక ఆమె చర్యలని గమనించే అవకాశం కలుగుతోంది. 'ఉదయం పూట ఒక గంట, రాత్రి ఒక గంట కేటాయిస్తే చాలు ఇంటిపనికి' అనుకునేవాడ్ని ఇదివరకు. నా అంచనా తప్పని ఇప్పుడిప్పుడే గ్రహించగలుగుతున్నాను.

"నేనెలాగూ రిటైరైపోయి ఇంటిపట్టునే ఉంటున్నాను కదా! వారంలో సగం నువ్వూ, సగం నేనూ పంచుకుందాం వంట పనీ, ఇంటపనీ చేసుకోవడానికి. నీకు కాస్త విశ్రాంతి దొరుకుతుంది" అన్నాను ఒకరోజు.

"ఛ...మీరు వంటపని చెయ్యడమేమిటి?"అంది నేనన్న మాటలింకా నా నోట్లో ఉండగానే.

"ఏం? ప్రతీనెలా మూడేసి రోజులు చేసేవాణ్ణిగా అప్పుడు!" అన్నాను వంట చెయ్యడంలో నాకు అనుభవం లేకపోలేదు సుమా అనే విషయాన్ని గుర్తు చేస్తూ."అప్పుడు తప్పనిసరి పరిస్థితి! అప్పుడు మీకు సాయం చెయ్యడానికి పిల్లలుండేవారు. అయినా ఇప్పుడు మీరు చెయ్యవలసిన అవసరమేమొచ్చిం



దని?" అని ఎదురుప్రశ్న వేసింది.

పేపర్ చదవడం మానేసి ఆమెనే గమనిస్తూ కూర్చున్నాను. ఇంటి పనులన్నింటినీ చేసుకునే బాధ్యత తనది మాత్రమే అనుకునే అమాయకురాలు.తామేదో కష్టపడి పోయి సంపాదించి ఇల్లు గడుపుతున్నామనీ, ఆడవాళ్ళు ఇంట్లో కూర్చుని పెద్దగా కష్టపడేదేమీ లేదనుకుంటారు అందరూ కాకపోయినా కొందరు మగాళ్ళు. ఇంటిపనులు చేసుకోవడానికి ఎంత ఓర్పు అవసరమో, ఎంత శ్రమపడాలో వాళ్ళు గ్రహించలేకపోతున్నారనే నేననుకుంటాను. మగవాళ్ళు చేసే పనికి వారానికో రోజు విశ్రాంతీ, వారికి అరవయ్యేళ్లు నిండేసరికి పూర్తి విశ్రాంతి ఉంటుంది. కానీ వీళ్ళకెప్పుడు విశ్రాంతి దొరికేది? ఆరోగ్యంగా ఉన్నన్నాళ్ళూ పని ఉండనే ఉంటుంది. ఎన్ని ఆధునిక పరికరాలు వచ్చినా జానకిలాంటి వాళ్ళకి ఎప్పుడూ చేతినిండా పనే!

"ఏంటండీ. పేపర్ పక్కన పడేసి ఆలోచిస్తున్నారు. కాఫీ తీసుకోండి" జానకి పిలుపుతో వాస్తవంలోకి వచ్చాను.

"పండగ దగ్గర పడుతోంది. పిల్లలిద్దరూ ఎప్పుడు వస్తున్నారో ఒకసారి ఫోన్ చేసి కనుక్కోడదూ" కాఫీ గ్లాసందించి అంది నా పక్కనే నిలబడి.

"నువ్వే కనుక్కోవచ్చుగా!" అన్నాను చిన్నగా నవ్వి.

"నేను చెప్తే. 'సెలవులు లేవు. పండగనాటికి వీలుచూసుకుని వస్తాం' అని అంటారని. మీరు ఫోన్ చేసి ఈసారైనా ఒకవారం రోజులు ముందుగా రమ్మని చెప్పండి"

మా పెద్దబ్బాయి హైదరాబాద్‌లో, చిన్నవాడు కలకత్తాలో. ఇద్దరూ ఉత్తర దక్షిణ ధృవాల్లా ఉన్నారు. కోడిళ్ళి

**ఎం.ఎస్.వి.గంగరాజు**

ద్దరూ కూడా ఉద్యోగస్తులే! ఒకరికి సెలవు దొరికితే మరొకరికి దొరకదు. ఎలాగోలా పండగనాటికి చేరుకుంటారు పిల్లల్తో ప్రతీ సంవత్సరం. వాళ్ళొస్తే ఇల్లంతా సందడే సందడి! వాళ్ళున్న నాల్రోజులూ జానకి ఒక మెషిన్‌లా మారిపోతుంది. కోడళ్ళిద్దరూ పనుల్లో సాయపడతామన్నా వాళ్ళను రానివ్వదు 'అక్కడికెళ్ళాక మీ ఉద్యోగాలూ, ఇంటిపనులూ ఎలాగూ తప్పవు. ఇక్కడ ఉండే ఈ నాల్రోజులూ విశ్రాంతి తీసుకోండి తల్లీ''అంటుంది.

తనకి కూతుర్లు లేని లోటు కోడళ్ళు తీరుస్తున్నారంటుంది. వాళ్ళు వెళ్ళిపోయాక ఇల్లంతా బోసిపోతుంది. మధ్య మధ్య ఇలా పిల్లా పాపలతో కలసి సంబరపడడానికే కాబోలూ మన సంప్రదాయంలో ఈ పండగలూ-పబ్బాలూ!.

ఆరోజు మా పెద్దబ్బాయి దగ్గర నుండి ఫోన్ వచ్చింది. వాడి ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ జరుగుతూండడం వలన వాడికి సెలవు దొరకదట. అందుకని పండగకి రాలేరుట! ఆ వార్త విని తను ఎంతో దిగులుపడిపోయింది. వాళ్ళు తీసుకెళ్లడానికి గుమ్మడి ఒడియాలూ, మనవల కోసం సున్నుండలూ చేసి డబ్బాల్లో వేసి ఉంచింది సంబరంగా.

పోనీ చిన్నవాడైనా వస్తాడనుకుంటే "అన్నయ్యా వాళ్ళు ఎలాగూ రావడం లేదు కదా. ఇప్పుడు సెలవులు వాడుకోకుండా ఉగాదికి వాడుకుంటాం. అన్నయ్యా వాళ్ళు ఎలాగూ ఉగాదికి వస్తారటగా" అన్నాడు వాడు.

'ఇద్దరూ కూడబలుక్కునే రావడం మానేస్తున్నారు. ఈ పండుగకి మనమిద్దరమే లింగులింగు మంటూ!'అని గొణుక్కుని బాధపడడం చూసాక విలవిలలాడిపోయాను వాళ్ళు రాకపోవడానికి కారణం నేనే కనుక!

* * *

"పండుగకి పిల్లలెలాగూ రావడం లేదు కదా. మనం ఓ పని చేద్దామా జానకీ?" అన్నాను ఆ సాయంత్రం.

"మనం బయలుదేరి పెద్దవాడి దగ్గరకెళ్దామా?" అంది కుతూహలంగా.

"కాదు. తీర్థయాత్రలకెళ్దాం. తిరుపతీ, కంచీ, రామేశ్వరం-ఇలా దక్షిణదేశ యాత్ర ఒక నెలరోజులు చేసి వద్దాం. ఎప్పుడూ ఇంటిపనుల్లో మగ్గిపోతున్న నీకు కాస్త ఆటవిడుపుగా కూడా ఉంటుంది" అన్నాను.

"పండగరోజుల్లో ఇంట్లో ఉండకుండా బయటతిరుగుతూ ఏం గడుపుతాం చెప్పండి"అంది కాస్త నిరుత్సాహంగా. "మనమేమైనా రోడ్ల మీద తిరుగుతూ గడుపుతామా ఏమిటి? పండగ రోజున దైవ సన్నిధిలో గడుపుదాం. చూడు జానకీ! మనం డబ్బు కోసం ఏమీ దిగులుపడనవసరం లేదు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇలా ప్రతీ సంవత్సరం కొన్ని ప్రదేశాలు తిరిగి వద్దాం. ఎవరికీ భారం కలిగించకుండా రెండు మూడేళ్ళలో నాలుగు ధామాలూ చూసెయ్యవచ్చు" అన్నాను ఆమెని ఒప్పించడానికి ప్రయత్నిస్తూ.

"సరే. మీ ఇష్టం. మీ మాటనెప్పుడు కాదన్నానని?"అంది చివరకు.

జానకి అంత తేలిగ్గా అంగీకరించడం చాలా సంతోషం కలిగించింది. తనకి కాస్త విశ్రాంతి దొరుకుతుందనే ఉద్దేశంతో ఈ పండగకి పిల్లలిద్దర్నీ రావొద్దని తనకి తెలియకుండా ముందుగా వాళ్ళకి ఫోన్ చేసి చెప్పాను. నా నిర్ణయానికి పిల్లలిద్దరూ సంతోషపడుతూ వారి ఆమోదం తెలిపారు. 'సెలవులు దొరకవని అమ్మతో చెప్పేస్తాం' అన్నారు.

"పోనీ. మీరిద్దరూ ఇక్కడకు వచ్చేయవచ్చుగా!" అని మధ్యలో మెలిక పెట్టాడు పెద్దబ్బాయి. "అక్కడికి వచ్చినా తనకి విశ్రాంతి ఉండదురా అబ్బాయ్. ఇంటిపనులన్నీ తన మీద వేసుకుంటుంది. కోడల్ని దగ్గరకు రానీయదు. మీ అందరితో పండగ జరుపుకోవడం నాకూ ఆనందదాయకమే. ఎటొచ్చీ తనకి విశ్రాంతి కుదరదు. అందుకే ఈ యాత్ర! ప్రతీ సంవత్సరం ఇలాగే ఒక నెలరోజులు మీ అమ్మని ఏదో ప్రదేశానికి తీసుకెళ్ళాలని నిర్ణయించుకున్నాను" అన్నాను.

"అలాగే నాన్నా. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వచ్చి వెళ్లండి" అన్నాడు.

* * *


సింహాచలం, అన్నవరం, విజయవాడలలో ఒక్కోరోజు గడిపి మేం తిరుపతి చేరుకునేసరికి సుమారు వారం దాటింది మేం ఇల్లు విడిచిపెట్టి. తిరుపతి కొండమీద రెండురోజులుండిపోయాం. ఒకరోజు స్వామివారి కళ్యాణంలో పాల్గొన్నాం. మరో రోజు జానకి కోరిక మేరకు సర్వదర్శనంలో చేరి దైవదర్శనం చేసుకున్నాం. అక్కడి పరిసరాలూ, వాతావరణం తనకి బాగా నచ్చాయ్.

"ఇలాంటి ప్రదేశంలో ఎన్నిరోజులున్నా ఇంకా ఉండాలనే ఉంటుందండీ" అంది.

కేవలం తనకోసమే కదా ఈ యాత్ర! "ఇంకోరోజు ఉందామా?" అన్నాను.

"ఒద్దండీ. ఇంకా చాలా స్థలాలు చూడాలంటున్నారు కదా! ఈసారి పిల్లలతో కలిసి వద్దాం"అంది.

దిగువ తిరుపతిలో బసచేసి గోవిందరాజస్వామి ఆలయం, అలివేలు మంగాపురం చూసాం. ఆ మర్నాడు కాణిపాకం, శ్రీకాళహస్తి చూసి వచ్చి కంచి మీదుగా మద్రాసు వెళ్లవలసి ఉంది. అప్పటికి ఇల్లు విడిచిపెట్టి పదిరోజులైంది. "ఇవాళ్టికి పదిరోజులైందండీ మనం ఇల్లు వదిలివచ్చి"అంది జానకి ఆ రాత్రి నిద్రపోయేముందు.




"మరే" అన్నాను తన వైపు ఆసక్తిగా చూస్తూ.

"మన యాత్ర ఇంకా ఎన్నిరోజులు పడుతుందండీ?"అంది అమాయకంగా.

"ఇంకో ఇరవైరోజులైనా పడుతుంది. మద్రాస్, బెంగుళూరు, మైసూర్, రామేశ్వరం...చూడవలసినవి చాలా ఉన్నాయి"

"నేనోమాట చెప్తాను. వింటారా?" అంది అభ్యర్థిస్తున్నట్టు. "చెప్పు జానకీ. నీకోసమే కదా ఈ యాత్ర తలపెట్టినది. నీకు ఇంటి దగ్గరా, పిల్లల దగ్గరా ఎక్కడున్నా విశ్రాంతి దొరకదు. నీకు పూర్తి విశ్రాంతి లభ్యమవుతుందనే ఇలా తీసుకొచ్చాను. మళ్లీ తిరుమల కొండకెళ్దామా? నీకా వాతావరణం బాగా నచ్చినట్టుంది" అన్నాను అనునయంగా.

నా వైపు దీనంగా చూస్తూ క్షణకాలం అలా ఉండిపోయింది. ఆమె ఎందువలనో దిగులుపడుతోందని గ్రహించి ఆందోళన చెందాను.

"నాకీ విశ్రాంతిలో శాంతి దొరకడం లేదండీ. ఈ యాత్ర ఇంతటితో ముగించి పెద్దవాడి దగ్గరకి హైదరాబాద్ వెళ్లిపోదాం. పండగ పదిరోజులుంది ఇంకా. మీరు గట్టిగా చెప్తే చిన్నవాడు వింటాడు. కోడల్నీ, పిల్లల్నీ తీసుకుని వాడిని హైదరాబాద్ వచ్చేయమనండి. అక్కడే పిల్లలతో పండగ జరుపుకుందాం. పిల్లల్ని చూడాలని ఉంది. పండగకి వస్తారని ఎంతో ఆశపడ్డాను. దైవదర్శనం చేసుకుంటున్నానన్నమాటే గానీ చిత్తశుద్ధి కలగడంలేదు.."తెరలు తెరలుగా వస్తున్న దుఃఖం వలన ఇక మాట్లాడలేక నా గుండెల మీద తల ఆన్చి మౌనంగా ఉండిపోయింది.

స్థాణువైపోయాను నేను క్షణకాలం. వెంటనే తేరుకుని "అలాగే జానకీ! రేపే హైదరాబాద్ వెళ్ళిపోదాం" అన్నాను తల నిమురుతూ.

తలెత్తి నావైపు ఒకసారి కృతజ్ఞతా పూర్వకంగా చూసి మళ్లీ ఒదిగిపోయింది.

నేను ఆలోచిస్తూ ఉండిపోయాను.

తాను చేసే పనులలో ఆమె పొందేది ఎప్పుడూ ఆనందానుభూతులే కాని శ్రమిస్తున్నాననే తలంపు ఏ కోశానా ఉండదు. ఇక విశ్రాంతి కావాలనే కాంక్ష ఉత్పన్నం అవ్వడానికి అవకాశం ఎక్కడిది? నేనే పొరపాటుగా భావించాను. తన కుటుంబసభ్యుల కోసం పడే ఆర్తిలో ఆమెకు ఆనందం ఉంది గానీ ఆక్రోశం కాదు! 'ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి' అని ఏ మహానుభావుడన్నాడో గానీ నిజంగా జానకి లాంటి వాళ్ళ పట్ల అది అక్షర సత్యం!